ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 187 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 14 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

## విపక్షాల విమర్శలను తిప్పికొట్టండి

## ఢిల్లీలోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో నేతలతో సమీక్ష



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కరవు, విద్యుత్ కొరత, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై నేతలతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. దిల్లీలోని రేవంత్ రెడ్డి నివాసంలో నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దిల్లీలో అందుబాటులో ఉన్న నేతలతో సీఎం, పీసీసీ అధ్యక్షుడు సమావేశమయ్యారు. గంటకుపైగా కొనసాగిన సమావేశంలో వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో మంత్రులు, ఎమెల్యేలు సైతం పాల్గొన్నారు.

**రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే**

గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు దిశానిర్దేశం చేశారు. ఎవరి పరిధిలో వాళ్లు గట్టిగా పని చేయాలని, పట్టభద్రుల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని సీఎం స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు ప్రతి విషయంలోనూ ప్రత్యేక దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డి నాయకులకు సూచించారు.నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సామా రామ్మోహన్ రెడ్డిలు పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించడంతోపాటు ఆయా నాయకులతో సమావేశమవుతూ తమ గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేలతో గంటకు పైగా జరిగిన సమీక్ష సమావేశంలో పట్టభద్రుల ఎన్నికలతోపాటు రాష్ట్రంలోని కరవు పరిస్థితులు, విద్యుత్తు కొరత లాంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను ఎక్కడక్కడ తిప్పి కొట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఎన్నికలు జరుగుతున్న ఆరు ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు సమన్వయంతో పని చేయాలని, రెండు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా ఇప్పటి నుంచే కార్యాచరణతో ముందుకెళ్లాలని సీఎం సూచించారు. పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు నేతలకు దిశానిర్దేశం చేశారు.




కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ..

# బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడుతున్నారు

## సబితా ఇంద్రారెడ్డి

### కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్ర విమర్శలు

### బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ ఖరారు కాకుండానే భూసేకరణ చట్టవిరుద్ధమని ఆరోపణ

### ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాలు బలవంతంగా లాక్కుంటున్నారని ధ్వజం

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటనను ప్రస్తావిస్తూ, బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదని, అలాంటప్పుడు బహదూర్‌గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని సబిత ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రభుత్వం అనవసరంగా సేకరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భూదాహం ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పంటలు వేయవద్దని సలహా ఇస్తోందని... కనీసం కరెంట్, సాగు, తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆమె విమర్శించారు. మెట్రో టెండర్లు రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పుడు

..మిగతా 2లో

## ఓటములకు ఓటర్ల జాబితా కారణమా?:

### రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్

### గుజరాత్ స్థానిక ఎన్నికల ఓటమికి ఓటర్ల జాబితా సవరణ కారణమా అని ప్రశ్న

2లో..

### గాంధీనగర్‌లో 41 ఏళ్లుగా కాంగ్రెస్ గెలవలేదని గుర్తుచేసిన హోంమంత్రి

### ప్రధాని మోదీకి ప్రజామద్దతుకు గుజరాత్ విజయమే నిదర్శనమని వ్యాఖ్య



# సింగరేణి కార్మికులకు దసరా బోనస్

### ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు

### పర్మనెంట్ కార్మికులతో సమానంగా పనిచేసే కాంట్రాక్ట్ వర్కర్లకు రూ.5 500 బోనస్

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ సందడి నెలకొంది. సింగరేణి సాధించిన నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,53,913 వరకు అందనుంది. పండుగకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండనుంది. బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. పండుగ వేళ బోనస్ ప్రకటనతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# రాహుల్ గాంధీ నివాసంలో ఇండి కూటమి నేతల తీర్మానం

### జంతర్ మంతర్ ను నిరసన ప్రదేశంగా కొనసాగించాలని డిమాండ్

### ఎన్నికల వ్యవస్థను నాశనం చేసిన బిజెపి... ప్రజాస్వామ్యాన్ని బ్రతికించాలన్నదే కూటమి తాపత్రయం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ నివాసంలో ఇండి కూటమి నేతల సమావేశం ముగిసింది. సీఈసీకి జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలని నిర్ణయించినట్లు విపక్షాలు తెలిపాయి. అదే విధంగా జంతర్ మంతర్ ను నిరసన ప్రదేశంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నాయి. అనంతరం ఇండి కూటమి నేతరాహుల్ మాట్లాడుతూ "ప్రజాస్వామ్యాన్ని బ్రతికించాలనే మా తాపత్రయం, దేశంలో ఎన్నికల వ్యవస్థ నాశనం చేశారు. మోదీ, అమిత్‌షా, జ్ఞానేష్ కుమార్‌కు ఉచ్చు బిగుస్తోంది. దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది. ధ్వంసమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే మా లక్షం అని అన్నారు. ఏఐసీసీ

..మిగతా 2లో

# కావేరికి గోదావరి జలాలు

### నదుల అనుసంధానం చేద్దాం.. తెలుగు గంగ ద్వారా చెన్నైకి నీటి సరఫరా

### దక్షిణాది రాష్ట్రాల్లో తాగు, సాగు నీరు పుష్కలం

### సీఎంలు చంద్రబాబు, విజయ్ చర్చలు

### విజయవాడ ఉత్సవ్ కు హాజరైన తమిళనాడు సీఎం

### కనకదుర్గమ్మను దర్శనం చేసుకున్న టీవీకే అధినేత



**అమరావతి, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

గోదావరి జలాలను కావేరీకి తరలించి దక్షిణాది రాష్ట్రాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్ కీలక చర్చలు జరిపారు. అమరావతిలోని నివాసంలో చంద్రబాబుతో విజయ్ భేటీ అయ్యారు. సుమారుగా గంటన్నరపాటు సాగిన ఈ సమావేశంలో గోదావరి -- కావేరీ నదుల అనుసంధానం, చెన్నై తాగునీటి అవసరాలకు తెలుగు గంగ ద్వారా నీటి సరఫరా వంటి కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. గోదావరి నుంచి కృష్ణాకు, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు, బొల్లాపల్లి నుంచి బనకచర్ల మీదుగా పెన్నాకు, కండలేరు ద్వారా కావేరికి నీటిని తరలించే ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం ముందుకు తెస్తోంది. గోదావరి నుంచి వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని సద్వినియోగం చేసుకుంటే దక్షిణాది రాష్ట్రాల్లో లక్షలాది మంది

..మిగతా 2లో



### జాతీయ రహదారులు

# ఐదు రోప్‌వేలకు ఆమోదం

### ఎల్బీనగర్-హయత్ నగర్...

### డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్

### హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్

### సేతు బంధన్ పథకం ద్వారా మూడు ఆర్‌వోబీల నిర్మాణం

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

ఎల్బీనగర్ - హయత్ నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం సహా తెలంగాణ రాష్ట్రంలోని పలు కీలక రహదారులు, ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల

..మిగతా 2లో

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరం





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్13 (ప్రభాత ఉదయం):**

లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న విజన్ వీక్ ఆఫ్ సర్వీస్ కార్యక్రమంలో భాగంగా, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సంయుక్తంగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఉటూర్ గ్రామంలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించాయి.క్లబ్ ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందించడంతో పాటు, కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, దృష్టి లోపాలను ముందుగానే గుర్తించడం, నివారించగల అంధత్వాన్ని అరికట్టడం ప్రధాన లక్ష్యాలుగా చేపట్టారు. శిబిరంలో గ్రామస్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు.ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ చైర్మన్ పెద్ది విద్యాసాగర్ నాయకత్వం వహించగా, కోఆర్డినేటర్ ముద్దసాని ప్రదీప్ రెడ్డి , సింగమరాజు, కోల అన్నారెడ్డి , వెంకటాద్రి, డా. తుంగూరి కార్తీక్ పాల్గొని తమ సేవలను అందించారు.శిబిరానికి అవసరమైన మందులను స్వస్తిక్ మెడికల్ ఏజెన్సీస్ ద్వారా నర్ల సాయి కృష్ణ స్పాన్సర్ చేశారు. వారి సహకారం ద్వారా శిబిరానికి హాజరైన రోగులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు తోడ్పాటు లభించింది.లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు మ్యాడం శివకాంత్ పటేల్, ముక్క శరత్ కృష్ణ, బట్టు వినోద్ పటేల్, మెతుకు కృష్ణ చైతన్య, ఐత సూరజ్ కుమార్, కంభం ప్రసాద్ ఈ సేవా కార్యక్రమానికి తమ సహకారాన్ని అందించారు.గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమాజ శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలను విస్తరించడం లయన్స్ క్లబ్‌ల ప్రధాన లక్ష్యమని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. లయన్స్ ఇంటర్నేషనల్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు.



# గద్వాలలో గోనుపాడు క్రషర్‌పై గనులశాఖ విజిలెన్స్ ఆకస్మిక దాడులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం గోనుపాడు గ్రామ శివారులోని గుట్టల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై గనులశాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. లైసెన్స్ గడువు ముగిసినా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కొనసాగుతున్న క్వారీ కార్యకలాపాలపై అధికారులు గట్టి నిఘా పెట్టి ఈ చర్యలు చేపట్టారు. గోనుపాడు శివారులోని ఒక క్రషర్ కంపెనీ మైనింగ్ తవ్వకాల కోసం గతంలో పొందిన లైసెన్స్ గడువు మార్చి 2025 నాటికే ముగిసింది. అయినప్పటికీ, ఎలాంటి రెన్యూవల్ చేసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా క్రషర్ అండ్ మైనింగ్ కార్యకలాపాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు.ఈ అక్రమాలపై అందిన సమాచారంతో హైదరాబాద్ రీజియన్ మైన్స్ విజిలెన్స్ అధికారులు మంగళవారం మద్యాహ్నం నుంచి రాత్రి వరకు క్వారీ ప్రాంతంలో విస్తృతంగా సోదాలు జరిపారు. తనిఖీల సమయంలో క్వారీలో నిల్వ ఉంచిన జెలాటిన్ స్టిక్స్, ఇతర పేలుడు పదార్థాలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సమక్షంలో పంచనామా నిర్వహించారు. ఈ దాడులకు సంబంధించి పూర్తిస్థాయి సమగ్ర నివేదికను త్వరలోనే జిల్లా కలెక్టర్‌కుసమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు

# కావేరికి గోదావరి జలాలు

**మొదటి పేజీ తరువాయి...**

ల

రైతులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల భాగస్వామ్యం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ భారీ ప్రాజెక్టును సాకారం చేయాలన్నది ఏపీ ప్రభుత్వ ఆలోచన. ఈ ప్రతిపాదనలపై చర్చించేందుకు తమిళనాడు సీఎం విజయ్ చొరవ తీసుకున్నారు. మరోవైపు, చెన్నై తాగునీటి అవసరాల కోసం తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది ఏపీ 4.08 టీఎంసీల నీటిని విడుదల చేసింది. తెలుగు గంగ నుంచి మరింత నీటిని విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం కోరుతుండగా నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. మానవీయ కోణంలో చెన్నై తాగునీటి అవసరాలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. సమావేశానికి ముందు చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విజయ్‌కు తమ నివాసం వద్ద సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి, మంగళగిరి శాలువాతో సత్కరించారు. సమావేశం ముగిసిన అనంతరం ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు వెళ్లారు. విజయ్ పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయనకు మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అధికారులు గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం విజయ్ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఎంపీ కేశినేని చిన్ని, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఘనంగా ఆహ్వానించారు. ఆలయ ధ్వజస్తంభానికి మొక్కిన అనంతరం, అంతరాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో విజయ్ పాల్గొన్నారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. విజయ్‌ను చూసేందుకు ఆలయ పరిసరాల్లో అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి కేరింతలు కొట్టారు

# ఓటములకు ఓటర్ల జాబితా కారణమా?: రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**



కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్‌లోని గాంధీనగర్ సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కారణమా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ఇటీవల వచ్చిందేనని, కానీ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ వరుస పరాజయాలను చవిచూస్తోందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళవారం 'ఇండియా' కూటమి నేతలు, విద్యార్థి సంఘాలతో సమావేశమైన అనంతరం రాహుల్ గాంధీ మీడియా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసమే తమ పోరాటమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాహుల్ మీడియా సమావేశం ముగిసిన వెంటనే స్పందించిన అమిత్ షా, గుజరాత్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. "గుజరాత్ ప్రజల మనోగతాన్ని ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. యావత్ దేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుక కొండలా నిలబడి ఉందన్న విషయాన్ని ఈ విజయం చాటిచెప్పింది. గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 44 స్థానాలకు గాను బీజేపీ 38 చోట్ల ఘన విజయం సాధించింది. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు బ్యాంకు 10 శాతం పెరిగింది. రాహుల్ గాంధీకి నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. గాంధీనగర్‌లో గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేదు" అని ఆయన గుర్తుచేశారు.

"రాహుల్ జీ, ఈ ఫలితాలకు కూడా ఓటర్ల జాబితా సవరణే కారణమని అంటారా? ప్రధాని మోదీకి, బీజేపీకి ఉన్న ప్రజాదరణను మీరు తోసిపుచ్చుతారా? మీరు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకప్పుడు అధికారంలో ఉన్న కీలక ప్రాంతంలో 41 ఏళ్లుగా గెలవలేకపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇటీవల పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది" అని అమిత్ షా ఎత్తి చూపారు.

ఢిల్లీలో వివిధ పార్టీల కార్యకర్తలను, జనాలను పోగేసినంత మాత్రాన దేశ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోలేరని ఆయన హితవు పలికారు. "దేశ ప్రజల వాస్తవ గొంతుక పొలాల్లో, గ్రామాల్లో, మారుమూల కొండలు, అడవులు, నదీ తీరాల్లో ఉంది. మీకు అక్కడి ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి అనేక రాష్ట్రాల్లో ప్రజలు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను తిరస్కరిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రతికూల రాజకీయాలు మానుకుని ప్రజలతో మమేకం కావాలి" అని ఆయన సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాహుల్ గాంధీ, ఆయన మిత్రపక్షాలకు బీజేపీ-ఎన్డీయే కూటమి మరో భారీ ఓటమిని రుచి చూపిస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.



# రాహుల్ గాంధీ నివాసంలో ఇండి కూటమి నేతల తీర్మానం

**మొదటి పేజీ తరువాయి...**

అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ తమ పోరాటం విజయవంతమైందని నిన్న సుప్రీంకోర్టుకు విపక్షాలు చేపట్టిన ధర్నాలో ఎన్నడూ లేని స్థాయిలో భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు ఎట్టి పరిస్థితుల్లో శిక్ష తప్పదని రాబోయే రోజుల్లో పోరాటం కొనసాగుతుందని ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ పేర్కొన్నారు. ఆందోళనపై భయంతోనే జంతర్ మంతర్ ను మూసి వేశారని జంతర్ మంతర్ ను నిరసన ప్రదేశంగా కొనసాగించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు.

### కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ..

# బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడుతున్నారు

**మొదటి పేజీ తరువాయి...**

బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రహదారి అవసరం ఏముందని నిలదీశారు. భూములు అమ్మి పాలన చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నాదర్‌గూల్‌లోని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, భూసేకరణ ఒత్తిడితో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆమె హితవు పలికారు.

### జాతీయ రహదారులు

# ఐదు రోప్‌వేలకు ఆమోదం

**మొదటి పేజీ తరువాయి...**



శాఖ నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంగళవారం ప్రత్యేకంగా భేటీ అయి పలు ప్రాజెక్టులపై చర్చించారు. కృష్ణా నదిపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు విజ్ఞప్తిపై స్పందించిన నితిన్ గడ్కరీ.. కొత్తగా డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ భేటీలో తెలంగాణ రహదారుల రంగానికి సంబంధించి మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పర్వతమాల పథకం ద్వారా తెలంగాణలో 5 రోప్‌వేల ఏర్పాటుకు, సేతు బంధన్ పథకం ద్వారా 3 ఆర్‌వోబీల నిర్మాణానికి కేంద్రమంత్రి గడ్కరీ ఆమోదం తెలిపారు. హైదరాబాద్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంపై సానుకూలంగా స్పందించారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోని 34 పనులకు సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయాలని కోరగా అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కేంద్ర మంత్రి గడ్కరీ ఆదేశించారు. వీటితో పాటు పుల్లూరు - అలంపూర్ - జట్రపోలు - పెంట్లవెల్లి - కొల్లాపూర్ - లింగాల - అచ్చంపేట - డిండి - దేవరకొండ - మల్లేపల్లి - నల్గొండ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని తెలుస్తోంది. హైదరాబాద్‌లో నవంబర్ 19 నుండి 22 వరకు జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలకు కేంద్రమంత్రిని ఆహ్వానించగా, అందుకు నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించి తప్పకుండా హాజరవుతానని తెలిపారు.



# శ్రీ అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చిన శ్రీ తాయమ్మ అమ్మవారు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**



గద్వాల పట్టణంలోని రెండవ వార్డులోని శ్రీ శ్రీ శ్రీ శక్తి స్వరూపిణి తాయమ్మ దేవాలయంలో మంగళవారం దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నవరాత్రుల మూడవ రోజు అమ్మవారు సమస్త లోకాలను పోషించే తల్లిగా భక్తులకు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో దివ్య మనోహరంగా దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష అలంకరణతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు బారిగా చేరుకుని అమ్మవారి దివ్య అలంకారాన్ని దర్శించుకొని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం కర్నూలు డాక్టర్ భార్గవ్ కుమార్ ఆధ్వర్యంలో కర్నూల్ నృత్య జ్యోతి కళా సంస్థ వారిచే అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు, కళాభిమానులు, మహిళలు, యువత పెద్దలు పాల్గొన్నారు. రాత్రి సుదర్శన్ రెడ్డి దంపతులు అల్పాహార కార్యక్రమం ఏర్పాటు చేశారు.



### ఎస్ఆర్ఆర్ పీజీ సెమిస్టర్

# ఫలితాలు విడుదల

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్13 (ప్రభాత ఉదయం):**

కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటనామస్ కళాశాల పీజీ రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్, అధ్యాపక బృందంతో కలిసి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ రెండో సెమిస్టర్ లో 86 శాతం, నాలుగో సెమిస్టర్ లో 84 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది కళాశాల నుండి బయటకు వెళ్తున్న పీజీ మూడవ బ్యాచ్ అని, వారు జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పీ నితిన్, టీ రాజయ్య, టీజీసీజీటీఏ అధ్యక్షుడు ఉన్నత విద్య ఐకాస చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ తాండ్ర కరుణాకర్, డాక్టర్ ఎం మల్లారెడ్డి, పీజీ సమన్వయకర్త మధు రాజేష్, అకాడమిక్ సమన్వయకర్తలు డాక్టర్ ఏ.శంకరయ్య, డాక్టర్ కట్టా వేణు, ఐక్యూఏసీ సమన్వయ హర్ జ్యోత్ కౌర్, స్టాప్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు

# మైలార్‌దేవ్‌పల్లిలో178.10లక్షలతో సీసీ రోడ్లు, రూ.67లక్షలతో టీఎన్‌జీఓఎస్ పార్కు

## అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్





**రాజేంద్రనగర్,అక్టోబర్13 (ప్రభాత ఉదయం)రాజేంద్రనగర్**

నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్(వార్డు నంబర్ 117)పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది.వివిధ కాలనీల్లో రూ.178.10లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులతో పాటు,రూ.67లక్షలతో చేపట్టనున్న టీఎన్‌జీఓఎస్ పార్కు అభివృద్ధి పనులకు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి,తో కలిసి ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ శంకుస్థాపన చేశారు.జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పార్కులో అవసరమైన వసతులు అభివృద్ధి చెందనున్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ...రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ప్రజలకు మెరుగైన రహదారులు,సురక్షితమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.కాలనీల్లో రహదారులు బాగుంటే ప్రజల రాకపోకలు సులభతరమవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తగ్గుతాయని అన్నారు.అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని,నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అలాగే రూ.67లక్షలతో చేపట్టనున్న టీఎన్‌జీఓఎస్ పార్కు అభివృద్ధి పనులతో స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పార్కులు ప్రజలకు విశ్రాంతి తీసుకోవడానికి,ఉదయం,సాయంత్రం వేళల్లో నడక వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను కొనసాగించడానికి ఉపయోగపడతాయని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని,ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేసి కాలనీల సమస్యలను పరిష్కరించాలని అన్నారు.నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మల్లయ్య,ఇంజనీరింగ్ అధికారులు,కాటేదాన్--మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు ఎన్.ధనుంజయ,టి.ప్రేమ్ గౌడ్,అడిగె అర్జున్,సరికొండ వెంకటేష్‌తో పాటు మాసున వెంకటేష్,మహేష్ గౌడ్,భాషా,శ్రీనివాస్, లక్ష్మారెడ్డి,గట్టయ్య,బొల్లా వెంకటేష్,సుధాకర్,మధుకర్, సోమశ్రీనివాస్,ఉదయ్‌కుమార్,సాయి రెడ్డి,కొండల్,శ్రీకాంత్,ఎల్లప్ప,శేఖర్,నాని, రాజు,లక్ష్మయ్య, బండారి యాదగిరి,గోపి,అనంతం గౌడ్,స్వామి గౌడ్,బాబురావు,మహేష్,ఏసు,సన్నావుల భాయ్,ఖలీల్,అతావుల భాయ్,గోవింద్,ప్రశాంత్ గౌడ్,సుందర్,విజయ్,పవన్, వెంకటేష్,అమ్రేష్, పాల్‌కుమార్,మార్కండేయ తదితరులు, ప్రజాప్రతినిధులు,కాలనీవాసులు పాల్గొన్నారు.



# మార్కండేయ నగర్‌లో ఘనంగా శ్రీ దుర్గామాత శరన్నవరాత్రి పూజలు

### అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 13(ప్రభాత ఉదయం)**

మార్కండేయ నగర్‌లో శ్రీ దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మార్కండేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, నవోదయ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండవ రోజు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ దీక్షలో ఉన్న సభ్యులు, మార్కండేయ నగర్ కాలనీ పెద్దలు, నవోదయ యూత్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ దుర్గామాతను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. పూజల అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు నిర్వాహక కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తుల రాకతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు ఏరువా సత్యనారాయణ ఏర్వ సత్యనారాయణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విడెం రమేష్, సత్య సాయి పొదుపు సంఘం అధ్యక్షులు పగిడిమర్రి సూర్యనారాయణ, కోట శ్యాం కుమార్, నవోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కోట పవన్ కుమార్,మలేష్, భానుచందర్, ముశం నరేష్, నరేష్, బాలాజీ, మహేష్, సాయి,ఉమాకాంత్, నాని,వెంకటేష్,మహేష్, ఆకాష్, యశ్వంత్, హర్షిత్,రితీశ్,ధర్మ,సిద్ధి,ఐశ్వర్య, రాజ్యలక్ష్మి, శ్రీనిధి, పాల్గొన్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా డా. పి. నాగిరెడ్డికి అవకాశం ఇవ్వాలి

### దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు నిస్వార్థ సేవ పార్టీ శ్రేణులు, ప్రజల డిమాండ్

### తెలంగాణ మలిదశ ఉద్యమంలో కూకట్‌పల్లి టీజేఏసీ కన్వీనర్ గా చురుకైన పాత్ర

### పీజేఆర్ స్ఫూర్తితో కాంగ్రెస్‌లో అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు

**కూకట్ పల్లి, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**



కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పి. నాగిరెడ్డికి గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని పార్టీ శ్రేణులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దివంగత జననేత పి. జనార్దన్ రెడ్డి (పీజేఆర్) స్ఫూర్తితో కాంగ్రెస్ లోకి వచ్చిన నాగిరెడ్డి, సామాన్య కార్యకర్త స్థాయి నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి, అధికార ప్రతినిధి స్థాయికి ఎదిగారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం కూకట్‌పల్లి 'ఏ' బ్లాక్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.తెలంగాణ మలిదశ ఉద్యమంలో కూకట్‌పల్లి టీజేఏసీ కన్వీనర్ గా చురుకైన పాత్ర పోషించారు. బీఆర్ఎస్ నుంచి ప్రలోభాలు వచ్చినా కాంగ్రెస్‌ను వీడలేదని, మేడ్చల్ ఎంపీగా రేవంత్ రెడ్డి గెలుపులో కీలక పాత్ర పోషించారని అభిమానులు గుర్తు చేస్తున్నారు.ఆర్టీసీ కార్మిక రంగంలో 20 ఏళ్లుగా కూకట్‌పల్లి డిపో గౌరవాధ్యక్షుడిగా, ఐఎన్‌టీయూసీ నేతగా సేవలందిస్తున్నారు. భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా అమ్మవారి దేవాలయం, బడి, వాకింగ్ ట్రాక్, పార్కులో రాధాకృష్ణన్, గాంధీ విగ్రహాలు, శ్రీ హరి హర క్షేత్రం అభివృద్ధి, దత్తాత్రేయ ఆలయ నిర్మాణం, సీనియర్ సిటిజన్ భవనం, మహిళా మండలి భవనం, గ్రంథాలయం ఏర్పాటు చేసిన ఘనత ఆయనదని స్థానికులు చెబుతున్నారు.సామాజిక సేవలకు గాను డాక్టరేట్, బెస్ట్ సర్వీస్ అవార్డులు అందుకున్న 58 ఏళ్ల నాగిరెడ్డికి తగిన గుర్తింపు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబులకు విజ్ఞప్తి చేశారు.



# అసాంఘిక శక్తులకు అడ్డాగా కెపిహెచ్‌బి ఫుట్ ఓవర్ బ్రిడ్జ్

### పనిచేయని లిఫ్టులు, లైటింగ్ లేక భయాందోళనలో మహిళలు - అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**కూకట్ పల్లి, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**



కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని మలేషియన్ టౌన్‌షిప్ రెయిన్ ట్రీ పార్క్ వద్ద పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్వహణ లోపంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన లిఫ్టులు చాలా కాలంగా పనిచేయడం లేదని, మరమ్మతుల కోసం అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బ్రిడ్జిపై అపరిశుభ్రత, మద్యం సీసాలు, లైటింగ్ లేకపోవడంతో రాత్రి వేళల్లో మహిళలు, విద్యార్థినులు వెళ్లేందుకు భయపడుతున్నారని, గంజాయి, మద్యం సేవించే వారికి స్థావరంగా మారిందని ఆరోపిస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రద్దీ రహదారిని దాటుతూ పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.సమస్యను తెలుసుకునేందుకు స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రతినిధులు నర్వ పవన్, తోట రమేష్, రేవతి, స్వర్ణ తదితరులు బ్రిడ్జిని పరిశీలించి, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.




# నిస్వార్థ సేవకులు కనకమామిడి జంగయ్య

### రాజేంద్రనగర్ అభివృద్ధి లో కనకమామిడి జంగయ్య కృషి మరువలేనిది

**బుద్వేల్, అక్టోబరు 13 (ప్రభాత ఉదయం) :**

నిస్వార్థ సేవకులు, విశ్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి, రాజేంద్రనగర్ వ్యవస్థాపకులలో ఒకరైన కనకమామిడి జంగయ్య మంగళవారం 86వ జన్మదిన వేడుకలను రాజేంద్రనగర్ లోని తన నివాసంలో జరుపుకున్నారు. ఆయనకు భార్య సందమ్మ, ఇద్దరు కుమారులు (దివంగత కె నరహరి దాసు), కె రామక్రిష్ణ రాజు, ఇద్దరు కుమార్తె లు విజయలక్ష్మి, సరోజ లు ఉన్నారు. కుమారుడు, కోడలు, కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాండ్ర ఆధ్వర్యంలో కనకమామిడి జంగయ్య జన్మదిన వేడుకలు నిర్వహించారు.

**నిస్వార్థ సేవకులు :**

రాజేంద్రనగర్ బస్తీ నిలవడానికి జంగయ్య కృషి ఎంతగానో ఉందని పలువురు చెబుతారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం కు చెందిన స్థలాలలో గుడిసెలు వేసుకుని ఉంటున్న వారి గుడిసెలను వర్సిటీ అధికారులు కూల్చివేయడానికి ప్రయత్నం చేసినప్పుడు ఆయన బస్తీకి చెందిన మరికొందరు పెద్దలతో రాజేంద్రనగర్ ను కాపాడటానికి ఎంతగానో కృషి చేశారు.

రాజేంద్రనగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి లోనూ...

రాజేంద్రనగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం (హరిహర క్షేత్రం) అభివృద్ధి లోనూ కనకమామిడి జంగయ్య పాత్ర ఉంది.

రాజేంద్రనగర్ అభివృద్ధి కోసం నేటికి తపన :

రాజేంద్రనగర్ బస్తీ అభివృద్ధి కోసం నేటికి తపిస్తుంటారు. యువతకు మంచి మంచి ఆలోచనలు ఇచ్చి ప్రోత్సహిస్తారు. రాజేంద్రనగర్ లో డిగ్రీ కళాశాల రావాలని, వృద్ధులకు సీనియర్ సిటిజన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆయన కోరుతున్నారు.

పలువురి గ్రీటింగ్స్:

కనకమామిడి జంగయ్య జన్మదిన వేడుకల సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు, నవజ్యోతి యూత్ క్లబ్ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియ చేశారు.

# భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు శాస్త్రీయ నృత్యాలుప్రతీకలు

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్

### బాబుల్‌రెడ్డినగర్‌లో ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు..

**రాజేంద్రనగర్,అక్టోబర్13 (ప్రభాత ఉదయం)**






రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ డివిజన్ పరిధి బాబుల్‌రెడ్డినగర్‌లో బొడ్రాయి వద్ద శ్రీనవదుర్గ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద నిర్వహించిన కూచిపూడి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.అమృత కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ అద్భుతమైన నృత్య ప్రతిభను ప్రదర్శించారు. భారతీయసంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన నృత్య ప్రదర్శనల్లో విద్యార్థుల హావభావాలు,లయబద్ధమైన అడుగులు,కళా నైపుణ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.దుర్గామాత ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమం బస్తీవాసుల్లో ఉత్సాహాన్ని నింపింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి,సంప్రదాయాలకు శాస్త్రీయ నృత్యాలు ప్రతీకలని అన్నారు.కూచిపూడి వంటి ప్రాచీన కళలను పరిరక్షించి,భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.విద్యార్థులు చదువుతో పాటు కళలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, కళాకారులను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతికి మరింత గుర్తింపు లభిస్తుందని తెలిపారు.అమృత కళాక్షేత్రం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలను అభినందిస్తూ వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో అమృత కళాక్షేత్రం అధ్యక్షుడు వంగ శ్రీనాథ్‌బాబు గౌడ్,గురువు కె.పావని,నరేష్ గౌడ్,శ్రీ నవదుర్గ ఉత్సవ సమితి సభ్యులు,బస్తీవాసులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి

### తాగునీరు, పశుగ్రాసం, రబీ సాగు, ప్రత్యామ్నాయ ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించాలిలి

### 15 రోజుల్లో గ్రామస్థాయి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలిలి

### అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మండల, గ్రామస్థాయిలో పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరం నుంచి వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల వల్ల తలెత్తే సమస్యలు, వాటిని ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న తొమ్మిది నెలలపాటు తాగునీటి సరఫరా, పశువులకు నీరు--పశుగ్రాసం, రబీ పంటల సాగు, గ్రామీణ ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన అనే నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గత వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాల లభ్యత తగ్గే అవకాశముందని, అందువల్ల ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని స్పష్టం చేశారు.తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ప్రతి గ్రామం, ప్రతి ఆవాస ప్రాంతం వారీగా తాగునీటి సరఫరాపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ పైపులైన్లలో లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి నీటి వృథాను అరికట్టాలని, ప్రతి కుళాయికి ఆన్--ఆఫ్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రత్యామ్నాయ నీటి వనరులైన బోర్లు, చేతిపంపులను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, పంపులు, మోటార్లలో తలెత్తే సమస్యలను 24 గంటల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి వనరులకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ముందుగానే తనిఖీ చేయాలని, ఈ అంశంపై 15 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు ప్రారంభించాలని ఆదేశించారు. పశుగ్రాసం కొరత నివారణకు ముందస్తు చర్యలువేసవిలో పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లోని పశువుల నీటి తొట్లకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త నీటి తొట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పశువుల సంఖ్య, అందుబాటులో ఉన్న పశుగ్రాసం, భవిష్యత్తులో అవసరమయ్యే పరిమాణాన్ని అంచనా వేసి ప్రణాళికరూపొందించాలన్నారు. వరి కోతల సమయంలో లభించే గడ్డిని వృథా చేయకుండా సేకరించి నిల్వ చేసుకోవాలని, గడ్డిని కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పశుగ్రాస విత్తనాల సరఫరా, ప్రత్యామ్నాయ పశుగ్రాస సాగును ప్రోత్సహించాలని తెలిపారు.

**రబీ సాగులో రైతులు నష్టపోకుండా పంటల ఎంపిక**

రబీ సీజన్‌లో రైతులు పంటల ఎంపికపై శాస్త్రీయ అవగాహనతో నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, భూగర్భజలాల లభ్యత, సాగునీటి వనరులు, ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకొని సాగు విస్తీర్ణాన్ని నిర్ణయించుకునేలా రైతులకు మార్గనిర్దేశం చేయాలన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ, స్వల్పకాలిక పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. నీటి లభ్యతను అంచనా వేయకుండా పంటలు సాగుచేసి రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ఉపాధి హామీ పనుల ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి**

వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున గ్రామీణ ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద చేపట్టగల పనులను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామం, ఆవాస ప్రాంతంలో అవసరమైన పనులను గుర్తించి అనుమతులు పొందాలని, నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భజలాల పెంపు, గ్రామీణాభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎంపీడీఓలు, ఏపీఓలు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రజలకు అవసరమైన మేరకు ఉపాధి పనులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి కార్యాచరణ అమలు చేయాలన్నారు.మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, విద్యుత్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మొదటి రెండు రోజుల్లో మండలస్థాయి సమావేశాలు నిర్వహించి, అనంతరం శుక్ర, శనివారాల్లో గ్రామస్థాయి సమావేశాల ద్వారా స్థానిక సమస్యలు, అవసరాలను గుర్తించాలని ఆదేశించారు. గ్రామస్థాయి సమావేశాల్లో సర్పంచ్‌లు,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు,ఉపాధ్యాయులు, రైతులు, గ్రామ పెద్దలను భాగస్వాములను చేయాలన్నారు.ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించి, గ్రామంలో ఉన్న సమస్యలు, అందుబాటులో ఉన్న వనరులు, అవసరమైన పరిష్కార చర్యలను నమోదు చేయాలని సూచించారు. రానున్న 15 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి, వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి. తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, పశువుల సంరక్షణ, రైతుల ప్రయోజనాలు, గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పన దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, డీఆర్ఓ శారదాదేవి, సీపీఓ సౌమ్య, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, జిల్లా ఉద్యానవన అధికారి సురేష్, గ్రౌండ్ వాటర్ అధికారి,ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్13 (ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ల సమక్షంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా బతుకమ్మ వేడుకల రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. కె. రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి పోస్టర్లు విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని తెలిపారు. మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని, బతుకమ్మ వేడుకల్లో అందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ రేవతి మాట్లాడుతూ...ఈ నెల 14వ తేదీన టీజీఓ భవన్, నాంపల్లి, హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 15వ తేదీన రంగారెడ్డి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా స్థాయి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ వైభవాన్ని చాటుతూ, బతుకమ్మ పండుగ వేడుకలను ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవాలని మహిళా ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని,బతుకమ్మ పండుగ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ రేవతి, కేంద్ర మహిళా విభాగం కోశాధికారి శాంతిశ్రీతో పాటు డి. సైదమ్మ, బాలేశ్వరి,రాణి, రాకేష్, మహేష్, ఐశ్వర్య, స్వప్న, సంధ్య, జ్యోత్స్న, ప్రమీల, లావణ్య,స్వాతి,పద్మాంజలి, సమంత, శ్రీదేవి, మైతిలి, రాజ్యలక్ష్మి, రజిత, కరుణ, రవాణి, భాను, పుల్లమ్మ, ప్రశాంతి, మమత, శ్రీలత, భవాని తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చిన శ్రీ తాయమ్మ అమ్మవారు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13(ప్రభాత ఉదయం)**

గద్వాల పట్టణంలోని రెండవ వార్డులోని శ్రీ శ్రీ శ్రీ శక్తి స్వరూపిణి తాయమ్మ దేవాలయంలో మంగళవారం దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా నవరాత్రుల మూడవ రోజు అమ్మవారు సమస్త లోకాలను పోషించే తల్లిగా భక్తులకు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో దివ్య మనోహరంగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

## ధనలక్ష్మి అలంకారంలో శ్రీజమ్ములమ్మ అమ్మవారు

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13(ప్రభాత ఉదయం):**

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గద్వాల పట్టణంలోని జమ్మిచేడు శ్రీజములమ్మ దేవాలయంలో అమ్మవారిని మంగళవారం ధనలక్ష్మి అలంకారం గావించారు. రూ. 9.99 లక్షలు విలువైన కరెన్సీ నోట్లతో విశేష అలంకారం చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ ఆధ్వర్యంలో భక్తులకు మౌళిక వసతులు కల్పించారు.





## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కోల్‌కతా సబ్ జూనియర్ త్రోబాల్ టోర్నీకి తెలంగాణ జట్ల ఎంపిక పూర్తి**

**కూకట్ పల్లి, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, త్రోబాల్ అసోసియేషన్ అడహక్ కమిటీ కన్వీనర్ డా. సత్యం శ్రీరంగం అన్నారు.కోల్‌కతాలో అక్టోబర్ 31 నుండి నవంబర్ 1 వరకు జరగనున్న సబ్ జూనియర్ త్రోబాల్ టోర్నమెంట్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా 15 మంది బాలురు, 15 మంది బాలికలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.డా. సత్యం శ్రీరంగం అధ్యక్షతన ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో అడహక్ కమిటీ సభ్యులు చిత్రా షెనాయ్, కృష్ణ రాజ్‌పుత్, భాస్కర్ రెడ్డి పాల్గొని ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.

# పక్షపాతం వీడేనా... అధికారుల తీరు మారేనా..?

**అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో మినహాయింపులెందుకు!?**

**పెద్దల భవంతులకు నోటీసులతో తాత్కాలిక ఊరట..**

**సామాన్యుల గూడుపై బుల్డోజర్ల వికృత ప్రతాపం..**

**నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న వైనం..**

**పేద, మధ్యతరగతి వర్గాల పైనే ప్రతాపం..**

**సిఎంసి అధికారుల పక్షపాత ధోరణిపై విమర్శల వెల్లువ**

**పటాన్‌చెరు, అక్టోబర్ 13(ప్రభాత ఉదయం):**

ఎక్కడైనా ఓ భవనం కూలి ప్రాణాలు గాల్లో కలిసినప్పుడు మాత్రమే నిద్రలేచే యంత్రాంగం.. ఆ తర్వాత తమ ఉనికిని కాపాడుకునేందుకు సామాన్యుల ఇళ్ళపై పగబట్టినట్లు వ్యవహరిస్తోంది. పటాన్‌చెరు, అమీన్ పూర్, ఆర్నిపూర్,తెల్లాపూర్,భారతీనగర్, జెపికాలనీ, బీరంగూడ,ముత్తంగి, బొల్లారం పురపాలక (సీఎంసీ) పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత అంశం ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతోంది. చట్టం అందరికీ సమానమేనని నినదించాల్సిన అధికార యంత్రాంగం, పెద్దల వద్ద సాగిలపడుతూ, నిరుపేదల నెత్తిన పిడుగులు కురిపిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.నిబంధనల ఉల్లంఘన పేరిట అధికారులు చేపడుతున్న చర్యల్లో స్పష్టమైన పక్షపాతం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కోట్లాది రూపాయల వ్యయంతో నిబంధనలు తుంగలో తొక్కి నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాల జోలికి వెళ్లడానికి అధికారుల చేతులు రావడం లేదు. వాటికి కేవలం నామమాత్రపు 'నోటీసులు' జారీ చేసి, ఫైళ్లను అటకెక్కించి చేతులు దులుపుకుంటున్నారు. రాజకీయ ఒత్తిళ్లు, తెరవెనుక సాగే పైరవీల ముందు నిబంధనల పుస్తకాలు మూతపడుతున్నాయి.కానీ, అదే అధికారం నిరుపేదలు, మధ్యతరగతి ప్రజల వద్దకు వచ్చేసరికి ఉగ్రరూపం దాల్చుతోంది. జీవితాంతం కష్టపడి కూడబెట్టిన పైసలతో, అప్పులు చేసి నిర్మించుకున్న రెండు గదుల గూడుపై కనికరం లేకుండా బుల్డోజర్లను ఎక్కిస్తున్నారు. కనీసం వివరణ ఇచ్చుకునే వ్యవధి ఇవ్వకుండా, సామగ్రిని బయటపెట్టుకునే తీరిక లేకుండా క్షణాల్లో నేలమట్టం చేస్తున్నారు.

**కూలుతోంది ఇళ్లు కాదు.. పేదల జీవితాలు!**

" తలదాచుకునేందుకు గూడు నిర్మించుకున్నాం.. పెద్ద పెద్దోళ్ల బంగ్లాలు కనిపించవా సార్, మా చిన్న ఇళ్లే కనిపించాయా?" అంటూ కూలిన గోడల మధ్య కూర్చుని గుండెలవిసేలా రోదిస్తున్న మహిళల ఆవేదన చూపరులను కలచివేస్తోంది. అధికారుల ప్రచార యావకు, రాజకీయ నేతల రక్షణలో ఉన్న బడా బాబుల స్వార్థానికి బలవుతోంది చిరుద్యోగులు, రెక్కాడితే గానీ డొక్కాడని రోజువారీ కూలీలే.

ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి తనిఖీలు చేయడం, ఆపై కొద్దిరోజులకే పాత పద్ధతిలోనే మామూళ్ల మత్తులో జోగడం అధికారులకు పరిపాటిగా మారిందన్న విమర్శలు స్థానికంగా బలంగా వినిపిస్తున్నాయి.









**బొల్లారం డివిజన్ పరిధిలో నేతల ఒత్తిళ్లు ..**

కూల్చివేతల్లో అధికారుల పక్షపాతం

బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ లో ఇటీవల అనుభూతుల నెపంతో ఈనెల ఆరవ తారీఖున ఓ బహుళ అంతస్తుల భవనంలో అధికారులు పాక్షిక కూల్చివేతలు జరిపారు.అంతవరకూ సమంజసం అయినప్పటికీ, అదే నిర్మాణానికి సమీపంలో ఉన్న మరో బహుళ అంతస్తుల భవనానికి అనుమతులు లేవంటూ గతంలో నోటీసులు ఇచ్చి మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకున్నారు. అయినప్పటికీ ఆ నోటీసులు బేఖాతరు చేస్తూ ఆ భవనాన్ని నిర్మిస్తున్నారు. అసలు నిర్మాణపు అనుమతే లేనప్పటికీ మరో అంతస్తు నిర్మాణం చేపట్టారు. సదరు నిర్మాణం కూల్చివేస్తున్న సమయంలో ఈ విషయం గురించి స్థానికులు,భవన నిర్మాణ దారులు అధికారులను నిలదీసారు. నేతల అండదండలు ఉన్న వారికి ఒక న్యాయం? తమకు మరో న్యాయమా? అని ఘాటుగా ప్రశ్నించారు. ఈ సమయంలో నీళ్ళు నమలడం అధికారుల వంతు అయింది. ఇది మచ్చుకు ఒక ఉదాహరణ,ఇలాంటి సంఘటనలు సర్వసాధారణం అయిపోయాయి.

అధికారుల పక్షపాత ధోరణి వీడేనా...పేద మధ్యతరగతి వర్గాలకు న్యాయం జరిగేనా..

నిజంగానే ప్రజా భద్రత, చట్టబద్ధమైన నగర ప్రణాళిక అధికారుల లక్ష్యమైతే, ఆ కూల్చివేతలు ఆక్రమణలకు పాల్పడిన పెద్దల నుంచే ఎందుకు మొదలుకావడం లేదు? అధికార పార్టీ అండదండలు, రాజకీయ పలుకుబడి ఉన్న నేతల నిర్మాణాలకు రక్షణ కల్పిస్తూ, ఎవరూ లేని నిస్సహాయులపై ప్రతాపం చూపడం ఏ ప్రజాస్వామ్య సూత్రం?

అధికార యంత్రాంగం తమ ద్వంద్వ వైఖరిని వీడకుంటే, ప్రజల ఆగ్రహ జ్వాలలు రగలడం ఖాయం. నోటీసుల పేరుతో పెద్దలకు రాయితీలు ఇవ్వడం ఆపి, సామాన్యుల పట్ల కనీస మానవత్వాన్ని ప్రదర్శించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. చట్టం ముందు అందరూ సమానులన్న నమ్మకాన్ని కాపాడేలా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పారదర్శక విచారణ చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.



## రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రసాద్ జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి**

**కూకట్ పల్లి, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ లోని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి తన మిత్రుడు జి. ప్రసాద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ ను శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించారు.ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రసాద్ వ్యాపారంలో దినదినాభివృద్ధి చెందాలని, అష్టైశ్వర్యాలతో, ఆరోగ్యంతో నిండు నూరేళ్లు జన్మదిన వేడుకలు జరుపుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వి. తాండవ కృష్ణ, జి. నర్సింగ్ రావు,సూర్యనారాయణ, శ్రీధర్, గణేష్, సాంబశివరావు, అఖిల్, మురళి తదితరులు పాల్గొని ప్రసాద్ కు శుభాకాంక్షలు తెలిపారు.



అక్రమంగా నీటిని తోడిన మోటార్లను స్వాధీనం చేసుకున్న జలమండలి విజిలెన్స్ అధికారులు

## అక్రమ మోటార్లపై జలమండలి విజిలెన్స్ కొరడా

**బోడుప్పల్‌లో 9 మోటార్లు స్వాధీనం**

**బోడుప్పల్, అక్టోబర్ 13(ప్రభాత ఉదయం)**

జలమండలి నీటి సరఫరా పైపులైన్ లకు అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని తోడుతున్న వారిపై అధికారులు, విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు.బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్ వార్డులో ఈస్ట్ హనుమాన్‌నగర్, హుడ లక్ష్మీనగర్ ప్రాంతాల్లో అధికారులు, విజిలెన్స్ బృందం సమన్వయంతో అక్రమ మోటార్లను అధికారులు తొలగించారు. ఈ తనిఖీల్లో 9 అక్రమ మోటార్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.నీటి సరఫరా సమయంలో పైపులైన్లకు మోటార్లు అమర్చి నీటిని తోడటం వల్ల ఇతర వినియోగదారులకు తగినంత నీరు అందకపోవడంతో పాటు సరఫరా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని జలమండలి తెలిపింది.అక్రమంగా మోటార్లు వినియోగించే వారిపై తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని జలమండలి అధికారులు హెచ్చరించారు



నల్లకు మోటర్ తో నీటిని లాగుతున్న ఇంటి వద్ద కనిపిస్తున్న జలమండలి విజిలెన్స్ పోలీసులు



## ధనలక్ష్మి అలంకారంలో శ్రీజమ్ములమ్మ అమ్మవారు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13(ప్రభాత ఉదయం):**

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గద్వాల పట్టణంలోని జమ్మిచేడు శ్రీజములమ్మ దేవాలయంలో అమ్మవారిని మంగళవారం ధనలక్ష్మి అలంకారం గావించారు. రూ. 9.99 లక్షలు విలువైన కరెన్సీ నోట్లతో విశేష అలంకారం చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ ఆధ్వర్యంలో భక్తులకు మౌళిక వసతులు కల్పించారు.



## బీరంగూడలో వైభవంగా దేవి నవరాత్రి పూజలు

**అమ్మవారిని దర్శించుకున్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్**

**పటాన్ చెరు, అక్టోబర్ 13(ప్రభాత ఉదయం):**

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీరంగూడ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో దుర్గామాత అమ్మవారి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాలనీలో భక్తి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కాలనీ వాసులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## మహిళా క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్13 (ప్రభాత ఉదయం):**

మహిళా క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలి ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్లోని శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు డాక్టర్ వంశీ చైతన్య క్యాన్సర్ ను ఎలా ఎదుర్కోవాలి ప్రారంభ దశని ఎలా గుర్తించాలి ముఖ్యంగా మహిళలు వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్ మొదటి దశలో కూర్చుంది పూర్తిగా నివారించవచ్చని ఆమె తెలిపారు 4ఏళ్లు దాటిన ప్రతి ఒక్క మహిళ బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలని ఆమె కోరారు క్యాన్సర్ వస్తే భయం దాన్ని మానసికంగా దృఢంగా ఉండాలన్నారు సకాలంలో కట్టుదిట్టమైన చికిత్స అందిస్తే క్యాన్సర్ నయం చేయవచ్చు అని తెలిపారు ఈ సందర్భంగా డాక్టర్ వంశీ చేతనను శాతవాహన లైన్స్ క్లబ్ చైర్మన్ బుర్ర మధుసూదన్ రెడ్డి సత్కరించారు

## దీపావళి తర్వాతే ఎండీఆర్ చార్జీలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం)**

డిజిటల్ చెల్లింపులు సామాన్యులు, ముఖ్యంగా వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. యూపీఐ పేమెంట్స్ పై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రిలీఫ్ ఇచ్చింది. యూపీఐ మర్చంట్ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ అమలును దీపావళి వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. వాస్తవానికి ఈ రూల్ అక్టోబర్ 15న అమల్లోకి రావాల్సి ఉంది. వ్యాపారుల నుంచి వస్తున్న విజ్ఞప్తులు, పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్‌పీసీఐ తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ఈ విషయాన్ని ధృవీకరించింది. దీపావళి వరకు ఈ ఛార్జీల అమలు ఉండదని స్పష్టం చేయడంతో వ్యాపార వర్గాలకు భారీ ఊరట లభించింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608